క్లుప్తంగా

మధ్యంతర భృతిపై శ్వేత పత్రం విడుదల చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల మధ్యంతర భృతిపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మౌలాలి, అజాంబేగ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్, అరియర్స్ వెంటనే ఇవ్వాలన్నారు. ఆర్థిక ప్రయోజనాలు ఇవ్వకుండా ప్రభుత్వం కాలం గడుపుతోందని అసహనం వ్యక్తం చేశారు. పరిస్థితిలో మార్పు రాకపోతే దసరా తర్వాత ఉద్యమాలకు సిద్ధమవుతామని తెలిపారు. సమావేశంలో నాయకులు నాగేశ్వర నాయక్, గోపాలకృష్ణ, దేవేందర్‌రెడ్డి, మాజీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ ప్రారంభం


క్యాంటిన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ: పట్టణంలోని పాతబస్టాండ్ నాగుల కట్ట సమీపంలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటిన్‌ను బుధవారం ఎమ్మెల్యే అఖిలప్రియ ప్రారంభించారు. అనంతరం అందరితో కలిసి అల్పాహారం తిన్నారు. ఇస్కాన్, అక్షయ పాత్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నా క్యాంటీన్ల నిర్వహణ కొనసాగుతుందన్నారు. మున్సిపల్ చైర్మన్ రామలింగారెడ్డి, కమిషనర్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

మద్యం దరఖాస్తులకు గడుపు పొడిగింపు


రుద్రవరం స్టేషన్‌లో మాట్లాడుతున్న సీఐ కృష్ణమూర్తి

రుద్రవరం: మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 11వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఆళ్లగడ్డ ఎక్సైజ్ సీఐ క్రిష్ణమూర్తి తెలిపారు. బుధవారం రుద్రవరం స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఆళ్లగడ్డ ఎక్సైజ్ పరిధిలో మొత్తం 19 మద్యం దుకాణాలకు టెండర్ ప్రక్రియ సాగుతోందన్నారు. ఇప్పటి వరకు 219 దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం 7 గంటల వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. 14వ తేదీ నంద్యాల కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయిస్తారని తెలిపారు. 16వ తేదీ నుంచి కొత్త మద్యం దుకాణాలు మొదలవుతాయని చెప్పారు. ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాసులు, రుద్రవరం ఏఎస్ఐ భూపాల్‌రెడ్డి ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బొమ్మలసత్రం: నంద్యాల మండలం శిల్పా నగర్‌కు చెందిన సురేష్ రెడ్డి (31) ఇంట్లో ఉరేసుకుని బుధవారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహం ఫ్యానుకు వేలాడుతుండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా. ఎస్ఐ నజీర్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు సురేష్ రెడ్డి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

15 గ్రామాలకు రూ.1.93 కోట్లు మంజూరు

ఉయ్యాలవాడ: మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ. 1.93 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు బుధవారం తెలిపారు. ఉయ్యాలవాడ పంచాయతీకి రూ. 28 లక్షలు, సర్వాయిపల్లె రూ. 10 లక్షలు, సుద్దమల్ల రూ. 10 లక్షలు, ఆర్.జంబులదిన్నె రూ. 15 లక్షలు, పెద్దయమ్మనూరు రూ. 5 లక్షలు, హరివరం రూ. 13 లక్షలు, ఆర్.పాంపల్లె రూ. 15 లక్షలు, కొండుపల్లె రూ. 15 లక్షలు, ఇంజేడు రూ. 15 లక్షలు, బోడెమ్మనూరు రూ. 10 లక్షలు, పుచ్చకాయలపల్లె రూ. 15 లక్షలు, రూపనగుడి రూ. 10 లక్షలు, మాయలూరు రూ. 15 లక్షలు, అల్లూరు రూ. 7 లక్షలు, ఎస్.కొత్తపల్లె రూ. 10 లక్షలు నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేయనున్నట్లు వెల్లడించారు. తుడుమలదిన్నె, గోవిందపల్లె, పడిగెపాడు, కాకరవాడ, నర్సిపల్లె పంచాయతీలకు నిధులు మంజూరు కాలేదని, మరో విడదతలో నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని వెల్లడించారు.

అదుపు తప్పిన బల్కర్ లారీ

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరు జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపాన మలుపు వద్ద బుధవారం సిమెంట్ బల్కర్ అదుపు తప్పింది. జిందాల్ ఫ్యాక్టరీ నుంచి సిమెంట్ లోడుతో నంద్యాల వైపు వెళ్తుండగా మలుపు వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. డ్రైవర్ కిందకు దూకేశాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానంది: మహానందీశుడికి నంద్యాల జిల్లా టెరిటోరియల్ డీఎఫ్ఓ నాగమునీశ్వరి బుధవారం పూజలు నిర్వహించారు. మహానందికి వచ్చిన ఆమె శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఆలయ పర్యవేక్షకులు శశిధర్‌రెడ్డి స్వాగతం పలికారు. వేదపండితులు ప్రసాదాలు అందించారు.

ఆమె చేతుల్లో నైపుణ్యం

- విత్తన పత్తి క్రాసింగ్ ఇంజినీర్లుగా మహిళలు
- మూడు నెలలపాటు మహిళలకు ఉపాధి


సీడ్‌పత్తి క్రాసింగ్ పనుల్లో పాల్గొన్న మహిళలు

దొర్నిపాడు: మండలంలో సీడ్ క్రాసింగ్ పనులు ఇప్పుడిప్పుడే మొదలయ్యాయి. రెండు వారాలుగా మగపూలు రాక ఇబ్బందులు పడ్డ రైతులు పనులు మాత్రం ఆపకుండా కొనసాగిస్తున్నారు. పొలంలో తేమశాతం తగ్గిపోతుండడంతో మగ మొగ్గల సంఖ్య క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో మరో మూడు నెలలు చేతినిండా పనులు మహిళల ఖాతాల్లో ఉన్నట్టే. నల్లరేగడి కావడంతో జిల్లాలోనే అత్యధికంగా సీడ్ పత్తిని సాగుచేస్తారు. కానీ సీడ్ క్రాసింగ్ పనులు చూసేవారికి సులభంగానే ఉన్నప్పటికీ ఎంతో నేర్పు నైపుణ్యత అవసరం అంటున్నారు మహిళా కూలీలు. గోటితో చేసే ఈపనికి కావాలి మహిళా మణులు అంటున్నారు రైతులు.

మహిళా కూలీలకే ప్రాముఖ్యత

సీడ్ క్రాసింగ్ పనులను ముఖ్యంగా మహిళా కూలీలకే పొలం యజమానులు ప్రాముఖ్యతను ఇస్తారు. ఎందుకంటే క్రాసింగ్ చేసే సమయంలో ఏ మాత్రం అదుపు తప్పినా పింజ రాలిపోతుంది. ఓర్పు, సహనం, నేర్పరిలో మహిళా మణులకు సాటి లేరనే నానుడి మాటలు విత్తన పత్తిలో ఎంతో ఉపయోగంగా మారుతున్నాయి.

క్రాసింగ్ అంటే...

మండల రైతులు సుమారు 1,022 హెక్టార్లలో మిత్తన పత్తిని సాగుచేశారు. ప్రతి పొలంలో ఆడ, మగ పత్తి మొక్కలను నాటుతారు. ఆడ మొక్కల మొగ్గలను గోటితో తొలగించి వాటి నామంకు మగ పువ్వుతో క్రాసింగ్ చేస్తారు. దీంతో మొగ్గ పరిపక్వం చెంది కాయగా మారుతుంది. కానీ ఇంతవరకు బాగున్నప్పటికీ మొగ్గను గోటితో తొలగించే సమయంలో చాలా జాగ్రత్తగా చేయాల్సి ఉంది. గోరు లోపలి కాయకు తగలకుండా నామం తొలగిపోకుండా ఇలా అంతా క్షణంలోనే తొలగించాలి. దీనికి ఎంతో నైపుణ్యత అవసరం. లేదంటే మొగ్గ మొత్తం చెట్టు నుంచి పూర్తిగా ఊడిపోతుంది. అనంతరం మరుసరి రోజు ఉదయం మగ పువ్వు పుప్పొడిని నామానికి దిద్దడంతో కాయగా మారుతుంది. దీన్నే మిత్తన పత్తి క్రాసింగ్ పనులు అంటారు. ఇలా రోజుకు ప్రతి చెట్టుకు 5నుంచి 10 మొగ్గలను క్రాసింగ్ చేస్తుంటారు. అలాగే కాయ నుంచి మొగ్గను తొలగించి రెడ్ కవర్‌ను తొడుగుతారు. ఎందుకంటే మరుసటి రోజు ఉదయం క్రాసింగ్ చేసేందుకు గుర్తుగా ఉంటుందని ఇలా చేస్తారు.


క్రాసింగ్ చేయిస్తున్న మహిళ

క్రాసింగ్ పనులు ఆశ్చర్యంగా ఉంటాయి



క్షేత్రస్థాయిలో పత్తిపంటలను పరిశీలించేందుకు వెళ్లినప్పుడు మహిళలు క్రాసింగ్ పనులను పరిశీలించాను. ఆడ మొగ్గను ఎంత నైపుణ్యంతో గోటితో ఒలిచి రెడ్ కవర్ తొడగడం చూసి ఆశ్చర్యానికి గురయ్యాను. మొగ్గలోపలి నామంకు ఎమాత్రం గోరు తగిలినా పాడవుతుంది. నిజంగా మహిళా కూలీలు గొప్ప పావీణ్యులనే చెప్పాలి. రైతులు ఒక ఎకరం క్రాసింగ్ పనులకు కేవలం కూలీలకే రూ. 2లక్షలకుపైగా చెల్లిస్తారు. –సునీత, ఏఓ, దొర్నిపాడు

కృత్రిమ గోరు తయారీ...

కాయనుంచి పువ్వును వేరు చేయాలాంటే తప్పని సరిగా బొటనవేలు ఎంతో ముఖ్యం. ఇలా మూడు నెలల పాటు చేయడంతో చాలా మందికి గోరు దెబ్బతినడంతో కృత్రిమ గోటిని తయారు చేసుకుంటున్నారు. అదెలా అంటే పాత బ్యాటరీ రేకుతో గోరులా కత్తిరించి ఫెవిక్విక్‌తో అంటించుకుంటారు. ఇలా ప్రతి బొటనవేలు కూడా ప్రత్యేకత ఉంది. చూడండీ మరీ ఇంత నైపుణ్యత కలిగిన మన మహిళా మణులను విత్తన పత్తి క్రాసింగ్ ఇంజినీర్లు అనక మానదు.

20 ఏళ్లుగా పనులు చేస్తున్నాను



నేను సుమారు 20 ఏళ్లుగా విత్తన పత్తి క్రాసింగ్ పనులు చేస్తున్నాను. ఎలాంటి పొరపాటు లేకండా క్రాసింగ్ చేసి కాయలను నిలబెడతాను. చాలా అనుభవం ఉంది కనుక ప్రతి చెట్టుకు 70 నుంచి 80 కాయలు వచ్చేలా చేస్తాను. అలాగే అందరూ ఇలా పోటీపడి మరీ పనులు చేస్తాం. అంతేగాక మాకు కూలి రోజు రూ.400 నుంచి రూ.500 వరకు ఇస్తారు. –లక్ష్మీదేవి, దబ్బ్యు గోవిందిన్నె

మూడు నెలల పాటు ఉపాధి



విత్తన పత్తి క్రాసింగ్ పనులు ఏటా మూడు నెలలపాటు ఉపాధి చూపుతుంది. ఈ పనులకు మహిళలకు మాత్రమే అధిక ప్రాధాన్యత ఇస్తారు. క్రాసింగ్ పనులు సులభమే కాని చాలా నైపుణ్యత అవసరం. ఎంతో ఓర్పుతో విత్తనపత్తి క్రాసింగ్ చేయాల్సి ఉంటుంది. ఎవరి వరుసలో ఎన్ని కాయలు నిలబడ్డాయో రైతులు లెక్కలేస్తారు. దీంతో మేము పోటీపడి మరీ కాయలు చెట్లనిండేలా శ్రమిస్తాము. నేను పదేళ్ల నుంచి క్రాసింగ్ పనులు చేస్తున్నాను. –ఫాతిమా, చాకరాజువేముల

హాస్టళ్లను శుభ్రంగా ఉంచుకోవాలి

- ప్రభుత్వ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్


హాస్టల్‌ను తనిఖీచేస్తున్న కలెక్టర్

నంద్యాల(అర్బన్): పేద విద్యార్థులు ఉండే సంక్షేమ వసతి గృహాలు శుభ్రంగా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. పట్టణంలోని బొమ్మల సత్రం వద్దనున్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ,గిరిజన సంక్షేమ వసతి గృహాలను బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టళ్లలో సౌకర్యాలపై జిల్లా సంక్షేమాధికారులు చింతామణి, శివప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హాస్టళ్లలోని గదులు, స్టోర్‌రూం, కిచెన్, డైనింగ్ హాల్, టాయిలెట్స్ తదితర వాటిని పరిశీలించి శుభ్రంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ హాస్టళ్లలో పనికిరాని వస్తువులన్నిటినీ వేలం వేసి వసతిగృహాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. టాయిలెట్లు, మంచి నీటి సరఫరా, డ్రైనేజీ, రహదారి సౌకర్యం, విద్యుత్ మరమ్మతులకు నివేదిక ఇవ్వాలని సూచించారు. మరో మూడురోజుల్లో వసతి గృహాలను సమీక్షిస్తానని ఆలోగా హాస్టళ్ల శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

కాలువ మళ్లింపుపై నివేదిక ఇవ్వండి


కేసీ కాలువను పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

ఆళ్లగడ్డ: కేసీ కాలువ పక్కకు మళ్లించిన దానిపై అన్ని శాఖల అధికారులు తక్షణం నివేదికలు ఇవ్వాలని జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. పట్టణ శివారులోని శిల్పా వెంచర్‌లో వెళుతున్న కేసీ సాగునీటి కాలువను నిర్వాహకులు పక్కకు మళ్లించి వెంచర్ వేయడం జరిగిందని ఇచ్చిన ఫిర్యాదు బుధవారం జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, మున్సిపల్, కేసీ కెనాల్ శాఖల అధికారులతో మాట్లాడి దీనిపై అందరూ పూర్తిస్థాయిలో నివేదికలు తయారు చేసి అందజేయాలని ఆదేశించారు. ఈయన వెంట ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

ఎమ్మెల్యే, జేసీ భేటీ చర్చనీయాంశం?

కాగా శిల్పా వెంచర్ నుంచి నేరుగా తహసీల్దార్ కార్యాలయం చేరుకున్న జేసీ, ఇతర అన్ని శాఖల అధికారులతో ఉండగా అంతలో ఎమ్మెల్యే అఖిలప్రియ ఇదే విషయంపై మాట్లాడేందుకు అక్కడికి చేరుకున్నారు. అయితే ఏకాంతంగా మాట్లాడాలని ఆర్డీఓ, తహసీల్దార్‌లతో సహా ఇతర అధికారులను, సిబ్బందిని అందరినీ బయటకు వెళ్లమని పంపించి జేసీతో మాట్లడడం చర్చనీయాంశంగా మారింది.

తపాలా సేవలను వినియోగించుకోండి


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పోస్టల్ అధికారులు

నంద్యాల(న్యూటౌన్): తపాలా సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా గాంధీచౌక్‌లో నడక ద్వారా మంచి జీవితం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు ఫైవ్‌స్టార్ గ్రామాలు, నాలుగు సంపూర్ణ బీమా గ్రామాలు, 20 సంపూర్ణ సుకన్య గ్రామాలను ప్రకటించారు. యూనివర్సల్ పోస్టల్ శాఖ యూనియన్ నిర్వహించిన లేఖా రచన పోటీల్లో పట్టణానికి చెందిన గుడ్ షెప్పర్డ్ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని తేజస్విని రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించి రూ.25 వేలు దక్కించుకుందన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు అన్నెం శ్రీనివాసరెడ్డి తపాలా సేవల ప్రాముఖ్యతలపై కవితల పోటీల్లో తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక నుంచి ప్రశంసలు అందుకోవడంతో ఆయనను సత్కరించారు. పార్వతి, షంషున్నిసా పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్) : ఐసీడీఎస్ నంద్యాల అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న 1 అంగన్‌వాడీ కార్యకర్త, 12 ఆయా పోస్టుల నియామకానికి అర్హులైన మహిళా అభ్యర్థినులు ఈనెల 10వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ చంద్రకళ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోస్టులు ఇలా.. అంగన్‌వాడీ కార్యకర్త షాదిక్‌నగర్–2 ఎస్సీ(ఇ) (నంద్యాల మున్సిపాలిటీ) (25 వ వార్డు), అంగన్‌వాడీ ఆయా, మంచాలకట్ట–1 (ఈడబ్ల్యూఎస్), గడివేముల–1 (బీసీ–బీ), జూలెపల్లె–1 (ఓసీ), గోస్పాడు–1(ఓసీ), నందమూరినగర్–1 (బీసీ–డీ), నెరవాడ–1(ఓసీ), మల్లికార్జున టెంపుల్–1(ఎస్సీ), పింజరిపేట–1 (ఈడబ్ల్యూఎస్), గోపాల్ నగర్–1(బీసీ–డీ), పాణ్యం– 1(బీసీ–ఈ), చాపిరేవుల–1 (బీసీ–ఏ), షాదిక్ నగర్–1(ఓసీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థి తప్పనిసరిగా 10వ తరగతి పాసై ఉండాలన్నారు. 2024 జూలై నాటికి 21 – 35 ఏళ్ల లోపువారై ఉండాలన్నారు. అభ్యర్థులు వివాహితులై ఉండి, స్థానిక నివాసితురాలై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ జనవాస ప్రాంతాలలో 21 సంవత్సరాలు నిండిన వారు లేకపోతే 18 ఏళ్ల నిండిన వారిని పరిగణలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. జనన, కుల, విద్యార్హత, నివాస స్థలం, వితంతవు అయితే భర్త మరణ ధ్రువ పత్రంతో పాటు దివ్యాంగులు పీహెచ్ సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలను దరఖాస్తుకు జతపరచాలని, 21వ తేదీ లోపు కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

వర్షం.. మొక్క జొన్న రైతుకు కష్టం


మొక్కజొన్నలపై పట్టలు కప్పుతున్న రైతులు

రుద్రవరం: మండలంలో బుధవారం ఉన్న ఫలంగా ఆకాశం మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసింది.కొద్ది రోజుల నుంచి మొక్కజొన్న కోతలు జోరుగా సాగుతున్నాయి. వచ్చిన గింజలను అందుబాటులో ఉన్న ఆర్అండ్‌బీ రోడ్లు, బయలు ప్రదేశాల్లో ఆబెట్టుకుంటున్నారు. ఆరగానే విక్రయాలు సాగిస్తున్నారు. అయితే వర్షం మొదలు కాగానే గింజలు తడవకుండా ఉండేందుకు రైతులు పరుగులు పెట్టారు. కొందరు కుప్పలుగా తోయడం, మరికొందరు అలాగే పట్టలు కప్పడంలో నిమగ్నమయ్యారు. గత నెల మొదటి వారంలో మొక్కజొన్నలు క్వింటా రూ.3300 పలుకగా ప్రస్తుతం రూ.2300లకు పడిపోయింది. గింజలు తడిస్తే వ్యాపారులు మరీ తక్కువ ధరకు అడుగుతారని అందుకే గింజలు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తోందని రైతులు వాపోయారు.


ముత్యాలచీర అలంకరణలో కాళికాంబదేవి


సరస్వతీదేవీ అలంకారంలో వాసవీ మాత


బాలాజీ కల్యాణ మండపంలో సరస్వతీదేవీగా అమ్మవారు


సంజీవనగర్ రామాలయంలో సరస్వతీదేవీగా కాశీవిశాలాక్షి


మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సరస్వతీదేవీగా..

సరస్వతీ.. నమోస్తుతే

నంద్యాల(వ్యవసాయం): దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకొని ఏడవ రోజైన బుధవారం పట్టణంలోని పలు దేవాలయాల్లో ఉదయం గణపతి పూజలు, పుణ్యాహ వాచనం, నవగ్రహ పూజలు, రాహుకాల పూజలు, కంకణధారణ, స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు, పూలంగిసేవ కార్యక్రమాలు, లలితా సహస్రనామాలు, వేదపారాయణాలు, హోమాలు, గోపూజలు నిర్వహించి సాయంత్రం ప్రదోష కాల పూజలు నిర్వహించి ప్రత్యేక మండపాల్లో సరస్వతీదేవి అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

– శ్రీకాళికాంబ దేవస్థానంలో కాళికాంబదేవికి ఉదయమే పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి అమ్మవారిని ముత్యాలచీర అలంకారంలో అలంకరించారు. సాయంత్రం ప్రత్యేక మండపంలో అమ్మవారిని మహా సరస్వతీదేవి రూపంలో అలంకరించారు.


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి


సరస్వతీదేవి అలంకారంలో అన్నపూర్ణాదేవి

అమ్మవారిశాలలో..

స్థానిక మెయిన్‌బజార్‌లోని అమ్మవారిశాలలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి మూలవిరాట్‌కు ఉదయం పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని విశేషాలంకరణ గావించారు. దేవి పారాయణం, నవగ్రహ యంత్రజపాదులు, మూలమంత్ర జపాదులు నిర్వహించారు. సాయంత్రం మండపంలో ఉత్సవమూర్తిని సరస్వతీదేవిగా అలంకరించారు.


దుర్గాదేవి పూజలో పాల్గొన్న మంత్రి ఫరూక్


సరస్వతీదేవీగా దుర్గాదేవి


సరస్వతీదేవీ, మహాగౌరీ అలంకారంలో కామేశ్వరి దేవి

సరస్వతీ నమస్తుభ్యం


ఆళ్లగడ్డ:అమ్మవారిశాలలో సరస్వతీదేవిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఆళ్లగడ్డ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు చదువుల తల్లి సరస్వతీదేవిగా భక్తులకు అభయమిచ్చారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పలు ఆలయాల వద్ద పిల్లలతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.కన్యాకాపరమేశ్వరి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.–సాక్షినెట్‌వర్క్




ముత్యాలపాడులో సరస్వతీదేవి, రుద్రవరంలో సరస్వతిదేవి | దొర్నిపాడులో..


ఉయ్యాలవాడలో..


శిరివెళ్ల: వీరారెడ్డిపల్లెలో అమ్మవారికి పూజలు

సామూహిక ఎలుకల నిర్మూలన తప్పనిసరి


బాచేపల్లిలో ఎలుకల ఎర తయారీపై అవగాహన

ఆళ్లగడ్డ: రైతులు సామూహిక ఎలుకల నిర్మూలన తప్పకుండా చేపట్టాలని వ్యవసాయాధికారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆర్‌కేవీవైఆర్‌ఏఎఫ్‌టీఏఆర్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. సదస్సుల్లో ఎలుకల మందు తయారీ, పొలాల్లోని బొరియల్లో పెట్టే విధానం వివరించారు. ఎలుకలపై పంట నష్టం ఎక్కువగా ఉంటుందని.. సకాలంలో నిర్మూలన చేపట్టాలని సూచించారు. అనంతరం ఎలుకల ఎర తయారీకి అవసరమైన బ్రోమోడిలిన్ అనే మందును రైతులకు పంపిణీ చేశారు.

రైతులకు అవగాహన

చాగలమర్రి: వరి సాగు చేసే రైతులు వరిమళ్లలో ఎలుకల నివారణకు సామూహిక విషపు ఎరలు తయారు చేసుకోవాలని ఎఫ్‌డీసీ ఏఓ ప్రభావతమ్మ, రంగ నేతాజీ తెలిపారు. బుధవారం మండలంలోని కదిరిపురం తండాలో వరి రైతులకు అవగాహన కల్పించారు. వరి పంటలో ఎలుకలు 20 నుంచి 25 శాతం పంట నష్టం కలిగిస్తాయని తెలిపారు. వాటి నివారణకు వరి పొలంలో కన్నాలు గుర్తించి బియ్యపు నూకలు 96 శాతం, నూనె 2 శాతం, మరియు బ్రోమోడయోలిన్ 0.005 శాతం మందు 2 శాతం చొప్పున కలుపుకుని ఎలుకల కన్నాల వద్ద 10 గ్రాముల చొప్పున ఉంచాలన్నారు. వరి కంకి ఏర్పడక ముందు చేయాలన్నారు.

- రుద్రవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఎలుకల నిర్మాలనపై ఏఓ శ్రీకృష్ణ అవగాహన కల్పించారు. ఏఈఓ రాజు, నవీన్ కుమార్‌రెడ్డి, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల చేసుకోండి

ఉయ్యాలవాడ: మండలంలోని పుచ్చకాయలపల్లెలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల కోసం మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో హెడ్ కుక్‌తో పాటు 4 సహాయ వంట మనుషులు, అలాగే స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 16వ తేదీలోగా స్థానిక ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. పాఠశాల ఉన్న గ్రామానికి చెందిన మహిళలకు మొదటి ప్రాధాన్యత, మండంలోని ఇతర గ్రామాలకు చెందిన వారికి ఆ తర్వాత ప్రాధాన్యత ఇస్తామన్నారు. హెడ్‌కుక్ పోస్టుకు ఓసీ జనరల్, సహాయ పోస్టులకు ఓసీ, ఎస్సీ, బీసీ–ఏ మహిళా అభ్యర్థులు, స్కావెంజర్ పోస్టుకు జనరల్ మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు.

రుద్రవరంలో 6 పోస్టులు

రుద్రవరం: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్–2, స్కావెంజర్, స్వీపర్, చౌకీదార్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏంఈఓ కోటయ్య తెలిపారు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఏడాది కాలానికి నియామకం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.